క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతుకు స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కూరగాయలు విక్రయించే రైతులకు స్టాళ్ల నంబర్ టోకెన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు ఒక సారి రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో భానుప్రకాష్‌కు కాంస్యం



భానుప్రకాష్‌ను అభినందిస్తున్న సన్‌మూర్తి

సీతంపేట: ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో నగరానికి చెందిన క్రీడాకారుడు పుప్పాల భానుప్రకాష్ ప్రతిభ చూపాడు. 45 ఏళ్లు నిండిన కేటగిరీలో హైజంప్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌ను సోషల్ మీడియా క్లబ్ స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి అభినందించారు. ఫుట్‌బాల్, క్యారమ్స్‌లో అనేక మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి విజేతలుగా నిలవడానికి భానుప్రకాష్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించి విశాఖకు మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం హారతి సమర్పించారు. అనంతరం గంటా శ్రీనివాసరావు, నాగరత్నం దంపతులు, సాయిదాక్షాయనిల ఆర్థిక సాయంతో పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాబా భజన, పల్లకీ సేవ జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పల్లకీ మోశారు. కార్యక్రమాల్లో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సు పేరిట హడావుడి ఏంటి?

ప్రభుత్వానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లేఖ

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయ్యాక ఎన్నికలకు ఏడాది ముందు పెట్టుబడుల సదస్సు పేరుతో హడావుడి వెనుక కారణాలు ఏంటని టీడీపీ నాయకుడు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ముందు గురువారం ఆయన ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. పెట్టుబడుల స్వర్గధామమైన దావోస్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ ఎకామిక్ ఫోరమ్‌కు వెళ్లకపోవడానికి సరైన కారణాలు తెలపగలరా, దాని వల్ల రాష్ట్ర ప్రతిష్ట ఎంత దెబ్బతిందో కనీసం ఇప్పటికైనా గుర్తించారా? అని లేఖలో ప్రశ్నించారు. ఒక రాజధానినే నిర్మించుకోలేని రాష్ట్ర ప్రభుత్వం.. పెట్టుబడిదారులకు ఎలాంటి నమ్మకాన్ని కలిగించగలదన్నారు. ఇక్కడ నుంచి ఎన్నో కంపెనీలు వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తే ఆపడానికి ఎందుకు ప్రయత్నించలేదన్నారు. ఇలాంటి 20 ప్రశ్నలను సంధిస్తూ ఎమ్మెల్యే గంటా ప్రభుత్వానికి లేఖ రాశారు.

స్మార్ట్‌గా హైస్కూళ్లు

- స్మార్ట్ సిటీ నిధులతో మారనున్న రూపురేఖలు
- జోరుగా రైల్వే న్యూకాలనీ ఉన్నత పాఠశాలల అభివృద్ధి పనులు



బాలికల హైస్కూల్ వద్ద అదనపు గదుల కోసం వేసిన పిల్లర్స్



రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ, కేఎన్ఎం గర్ల్స్ హైస్కూళ్లు

తాటిచెట్లపాలెం: స్మార్ట్ సిటీ నిధులతో జీవీఎంసీ పరిధిలోని పలు పాఠశాలల దశ మారనుంది. గతంలో మన బడి నాడు–నేడు కార్యక్రమం కింద కొన్ని స్కూళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. అప్పుడు ఎంపిక కాలేని మరికొన్ని బడులను స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్, కేఎన్ఎం గరల్స్ హైస్కూళ్లకు మహర్దశ పట్టింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల శాతం పెరగడంతో ఈ హైస్కూళ్లను ఆధునికీకరిస్తున్నారు.

జీవీఎంసీ హైస్కూల్‌లో అదనపు గదులు

రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం ఉన్న 10 తరగతి గదులు చాలకపోవడంతో మరిన్ని అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపగా.. మరో అదనపు అంతస్తులో 5 తరగతి గదులను నిర్మించేందుకు అనుమతులు వచ్చాయి. అదనపు అంతస్తుకు సంబంధించిన శ్లాబ్ పనిని ఇటీవలే పూర్తి చేశారు. దీంతోపాటు డైనింగ్ హాల్, బాత్ రూమ్‌లు, తరగతి గదుల ఆధునికీకరణ వంటి పనులు జోరుగా చేపడుతున్నారు.

కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో వసతులు

కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్లో ప్రస్తుతం 386 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ స్కూల్‌కు కూడా మరో అదనపు అంతస్తులో 5 తరగతి గదులకు అనుమతులు రావడంతో పనులు ప్రారంభించి పిల్లర్స్ వేశారు. మిగిలిన పనులను శరవేగంతో పూర్తిచేస్తున్నారు. డైనింగ్ హాల్, బాత్‌రూమ్‌లను పూర్తిచేశారు. ఈ ఉన్నత పాఠశాలల్లో కొత్త సదుపాయాలను కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల చేరికలు



ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయి. అదనంగా తరగతి గదులు అవసరమని నివేదించడంతో స్మార్ట్ సిటీ నిధులతో ఈ పనులు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ తరగతి గదులు అందుబాటులోకి రానున్నాయి.

– జి.సన్యాసిరావు, హెచ్ఎం, జీవీఎంసీ హైస్కూల్

తరగతి గదుల ఆధునికీకరణ



స్మార్ట్ సిటీ నిధులతో మా పాఠశాలను అభివృద్ధి చేస్తున్నారు. పాత తరగతి గదులను కూడా ఆధునికీకరించనున్నారు. పాత తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు ఇలా అన్ని మార్చి కొత్తవి అమర్చుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇవన్నీ అందుబాటులోకి వస్తాయి.

– కె.రాము, హెచ్ఎం, కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్

క్రైం కార్నర్

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కంచరపాలెంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఓల్డ్ రామారావు హాస్పిటల్ వద్ద కల్లూరి చందు(21) అనే యువకుడు తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. వారు రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. యువకుడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం అర్ధరాత్రి ఎంతసేపటికీ భోజనానికి రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు చూసేసరికి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని కిందకి దింపి ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ వ్యక్తి కాలువలో పడి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ దరి శ్రీనివాసనగర్‌లో సామిరెడ్డి చిట్టిబాబు(57) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఇతడు గతంలో పోర్టు ఉద్యోగిగా పనిచేసి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. మద్యం తాగే అలవాటు ఉంది. ఇంటి నుంచి బుధవారం ఉదయం మెట్ల మార్గం గుండా బయటకు వచ్చే క్రమంలో కాలువలో పడిపోయాడు. బంధువులు, చుట్టుపక్కల వారు ఆస్పత్రిలో చేర్పించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఆ ప్రాంతవాసులు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు సమీక్షించారు. గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్



చిట్టిబాబు కాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం అక్కయ్యపాలెం జోన్ ఆధ్వర్యంలో గురువారం 45వ వార్డు చిట్టిబాబు కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ నాయకుడు స్వతంత్రకుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రూ.5 గ్యాస్ సిలిండర్ ధర పెరిగితే పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసనలు చేసే వారని గుర్తు చేశారు. అదే బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200 చేసి సామాన్యులపై భారం మోపిందని మండిపడ్డారు. గ్యాస్ బండను పక్కన పెట్టేసి కట్టెలతో వంటలు చేసుకునే పరిస్థితి వచ్చిందని గ్యాస్ బండ, కట్టెల పొయ్యిలతో వీరు వినూత్నంగా నిరసన తెలిపారు. తక్షణం గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గౌరీశ్, ఆర్.ఎన్.మాధవి, జ్యోతి, యు.ఎస్.ఎన్.రాజు, కె.ఎస్.కుమార్, బి.లక్ష్మీపతి, కె.రమణమూర్తి, చిన్న, గంగ, ఆదిలక్ష్మి, సుందరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగ్ సమస్య పరిష్కారానికి కృషి



ఆర్పీ పేట రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట రైల్వే క్రాసింగ్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రైల్వే క్రాసింగ్ రక్షణ గోడను గురువారం ఆయన పరిశీలించారు. స్థానికులు సమస్యను వివరించారు. దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్ కాలనీ, ముత్యమాంబ కాలనీ, గవర కంచరపాలెం, ఆర్పీపేట ప్రాంతాల ప్రజలు కంచరపాలెం జంక్షన్‌కు రాకపోకలు సాగించడానికి ఇక్కడి మార్గం సులభంగా ఉంటుందని, రైల్వే భద్రత పేరిట అధికారులు రక్షణ గోడ నిర్మించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. జేడీ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు సర్వసిద్ధి గౌరీశంకర్, పిన్నమనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సమయపాలన ముఖ్యం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు, బయోమెట్రిక్ వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. పీఎం పాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వను పరిశీలించారు. గర్భిణులకు ప్రయాణ సదుపాయం కల్పించాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు శశిభూషణ్, బి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో సీసీ కెమెరాలు



పార్కులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



మానిటర్‌లో రికార్డయిన దృశ్యాలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్కు సందర్శకులకు, పార్కులో రక్షణకు 12 కెమెరాలను అమర్చామన్నారు. రామానుజ సుధీర్ దీనికి అవసరమైన రూ.65,000ను విరాళంగా అందించారని చెప్పారు. డిజిటల్ డే అండ్ నైట్ కలర్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పూట విద్యుత్ లేకపోయినా, లైట్లు వెలగకపోయినా కెమెరా రికార్డు చేస్తుందని, నెల రోజుల సమాచారం నిల్వ ఉంటుందని తెలిపారు. వైఫై సదుపాయాన్ని కల్పించారు. ఈ నెల 5న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర వీటిని ప్రారంభిస్తారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధిలోని 200 వాకర్స్ పార్కుల్లో మొట్టమొదటిసారిగా మురళీనగర్ వాకర్స్ పార్కులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.


కళలతో సమాజంలో గుర్తింపు



నాటికను తిలకిస్తున్న బులికృష్ణ

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు. గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, అతిథులు తలసాని కృష్ణప్రసాద్, అబ్దుల్ అశోక్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. ఈ నెల 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వంటిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

అధినేతను కలిసిన నాయకులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.కె.రాజు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొకే అందిస్తున్న కటుమూరి సతీష్



అధినేతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరుదు కల్యాణి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బానాల శ్రీనివాసరావు

గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో బసచేసిన సీఎం జగన్‌ను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజతోపాటు త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో రుసుం చెల్లించవచ్చు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



49వ వార్డులో ఓటు ఎలా వేయాలో సూచిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు



51వ వార్డులో పట్టభద్రులకు కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



తాటిచెట్లపాలెంలో పట్టభద్రురాలికి కరపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

సీతంపేట: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆదేశాల మేరకు గురువారం 25వ వార్డు శ్రీనివాస వీధిలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సారిపిల్లి సంతోష్, సానబోయిన సురేష్, ఉప్పాడ సన్నీ, జయ, గోవిందమ్మ, పద్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్లను కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ శ్రేణులు కారుకొండ రాజు, నేపాల్ శ్రీను, చింతల బాబూరావు, ఆదిలక్ష్మి, సువర్ణ, నానిబాబు, సన్యాసప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

49, 51, 53 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో కార్పొరేటర్ అల్లు శంకరరావు పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. 284 సచివాలయం పరిధి అయ్యప్పనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో 67 మంది పట్టభద్రులకు కరపత్రాలు అందజేసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

- 51వ వార్డు 288 సచివాలయం పరిధి సీతన్న గార్డెన్స్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఎన్నికల ప్రచారం చురుగ్గా చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని గ్రాడ్యుయేట్లను అభ్యర్థించారు.
- 53వ వార్డు 296 సచివాలయం పరిధిలో కార్పొరేటర్ బర్కత్ అలీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రారంభం



స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌కు ఓటరు స్లిప్ అందిస్తున్న సచివాలయ అడ్మిన్లు

సీతంపేట: ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్‌ల పంపిణీ మొదలైంది. సచివాలయ సిబ్బంది గురువారం ఉదయం 25వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీతంపేట సచివాలయం పరిధిలో అడ్మిన్ లక్ష్మణ్ రెడ్డి, 131 సచివాలయ అడ్మిన్ హరికృష్ణ పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి స్లిప్‌లు అందజేస్తున్నారు. 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌కు మొదటి స్లిప్‌ను అందించారు. సీతంపేట సచివాలయం పరిధిలో 200 వరకు ఓటర్లు ఉన్నారని అడ్మిన్లు తెలిపారు. 14, 24, 25, 26 వార్డుల ఎమ్మెల్సీ ఓటర్లకు నక్కవానిపాలెం జీవీఎంసీ స్కూల్, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 13న కేటాయించిన పోలింగ్ బూత్‌ల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.